జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

మంగళవారం | 3 | మార్చి | 2026 ◆ పేజీలు : 8



## ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రజాజ్యోతి ):** ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో భాగంగా జనగామ పట్టణంలోని ఏబివి ప్రయివేట్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ లని సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు వివరాలు, సీసీ కెమెరాల పనితీరు, తాగునీరు, వైద్య సదుపాయాల

మిగతా 2 లో...



## పదవ తరగతి పరీక్షలకు...

# అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జీ**

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి):** మార్చి 14 నుండి పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జీ అధ్యక్షతన ములుగు జిల్లాలోని లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని విద్యార్థులకు పరీక్ష రాయడానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు.పరీక్షా కేంద్రంలోనికి ఏ అధికారికి కూడా సెల్ ఫోన్ తో అనుమతి లేదని,పరీక్షా కేంద్రం సందర్శించడానికి వచ్చిన అధికారులు ఎవరైనా కూడా వారి మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన క్లాక్ రూం వద్ద డిపాజిట్ చేసిన అనంతరం మాత్రమే పరీక్షా కేంద్రంలోకి వెళ్లాలని సూచించారు.చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు కూడా సెల్ ఫోన్ తీసుకు రాకూడదని తెలిపారు.ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఇద్దరు పోలీస్ సిబ్బందిని ఉంచాలని,పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్నాపత్రం పరీక్షా కేంద్రానికి తీసుకు వెళ్లేటప్పుడు, పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేసే సమయంలో తప్పకుండా పోలీస్ సిబ్బంది సమక్షంలోనే జరగాలని అన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని,పరీక్షా కేంద్రాల పరిసరాలలో పరీక్ష

మిగతా 2 లో...



# పల్లెలకు సీసీ కెమెరాలే రక్ష..

## మామునూర్ ఏసీపీ వెంకటేష్

- కాపులకనపర్తిలో రేడియం పెట్రోల్ కారు ప్రారంభం..
- ఒకొక్క సీసీ కెమెరా ఒక పోలీసుతో సమానం..
- కెమెరాల ఏర్పాటుతో నిత్యం పోలీస్ నిఘా ఉంటుంది
- పర్వతగిరి సిఐ రాజగోపాల్ సంగెం ఎస్సై వంశీకృష్ణ

**సంగెం, మార్చి 02 (ప్రజాజ్యోతి ):** పల్లెల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం వల్ల ప్రజల భద్రత మరింత పెరుగుతుందని మామునూర్ ఏసీపీ వెంకటేష్ పేర్కొన్నారు.సోమవారం రోజున మండలంలోని

మిగతా 2 లో...

## సహజ రంగులతో సాంప్రదాయబద్ధంగా

# హోలీ జరుపుకోవాలి

- హోలీ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- మట్టేవాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు



**వరంగల్ సిటీ, మార్చి 02(ప్రజా జ్యోతి):** నగర ప్రజలు హోలీ పండుగను సహజమైన రంగులతో సాంప్రదాయబద్ధంగా శాంతియుతంగా జరుపుకోవాలని మట్టెవాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు కోరారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఒక ప్రకటన విడుదల చేశారు. మట్టేవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ ఎన్.కరుణాకర్ ప్రజలకు మరియు పోలీసు సిబ్బందికి హోలీ పండుగ

మిగతా 2 లో...

## రోడ్ భద్రతపై పోలీసుల

# వినూత్న ప్రచారం

- అవగాహన కార్యక్రమం
- ఉచితంగా హెల్మెట్లు పంపిణీ
- ఏ ఎస్పీ మనన్ భట్ ఐపిఎస్



**ఏటూర్ నాగారం మార్చి 02 ప్రజా జ్యోతి :** రోడ్ భద్రతపై పోలీసుల వినూత్న ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఏటూర్ నాగారం ఏ ఎస్పీ మనన్ భట్ ఐపిఎస్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు ఏటూర్ నాగారం వై జంక్షన్ వద్ద సోమ వారం రోడ్డు భద్రతపై పోలీసు శాఖ

మిగతా 2 లో...

# పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)
నిర్వహణ సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అన్నారు. పరీక్ష సమయంలో తహశీల్దార్ పరీక్షాకేంద్రాన్ని సందర్శిస్తారని డిటి స్థాయి అధికారులు సెట్టింగ్ స్క్వాడ్ గా ఉంటారని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎంతో పాటుగా మెడికల్ కిట్,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.రూరల్ వాటర్ సప్లై,జిల్లాపంచాయతీ అధికారులు సంయుక్తంగా పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు ఏర్పాటుచేయాలని, పంచాయతీ సిబ్బంది పరీక్షా కేంద్రాలను శుభ్రపరిచి సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఆర్టీసి పరీక్షా కేంద్రాల వైపు పరీక్ష ప్రారంభానికి గంట ముందు,పరీక్ష అనంతరం గంట తర్వాత బస్సులు సరిపడా నడపాలని ముఖ్యంగా కన్నాయిగూడెం నుండి ఏటూరునాగారం వైపు, మంగపేట నుండి రాజుపేట సెంటర్ వైపు,తాలు బాక నుండి వెంకటాపురం వైపు,ధర్మవరం నుండి వాజేడు పరీక్షాకేంద్రానికి, బీరెల్లి,కాటాపూర్ నుండి తాడ్వాయి పరీక్షాకేంద్రం వైపు,పత్తిపల్లి,దేవగిరిపట్నం నుండి ములుగు,ములుగు నుండి మోడల్ స్కూల్ బండారుపల్లి పరీక్షకేంద్రాలకు విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు విధిగా సమయానుగుణంగా నడపాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా సమావేశానికి డిపిఓ,ఎలక్ట్రిసిటీ అధికారి, మెడికల్ అండ్ హెల్త్ఆఫీసర్, ఆర్టీఓ,పోలీస్ డిపార్ట్మెంట్ నుండి సిఐ,ఆర్టీసీ అధికారులు,రూరల్ వాటర్ సప్లై అధికారి,డిటిఓ,విద్యా శాఖ కార్యాలయ సిబ్బంది ఏసిజిఈ వినోద్ కుమార్, కో–ఆర్డినేటర్లు రాజు,శ్యాం సుందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

(మొదటి పేజీ తరువాయి...)
గురించి అడిగి తెలుసుకున్నారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని,విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల నిర్వాహకులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.

## పల్లెలకు సీసీ కెమెరాలే రక్ష..




(మొదటి పేజీ తరువాయి...)
కాపులకనపర్తి గ్రామంలో సర్పంచ్ చంద్రమౌళి సహకారంతో 16 కొత్త కెమెరాలు ఏర్పాటు చేయగా మామునూర్ ఏసీపీ వెంకటేష్ పర్వతగిరి సిఐ రాజగోపాల్ సంగెం ఎస్సై వంశీకృష్ణ ప్రారంభించి అభినందించారు.అదేవిధంగా ఎస్సై వంశీకృష్ణ యాక్సిడెంట్లు జరగకుండా ఏర్పాటుచేసిన రేడియం పెట్రోలింగ్ కారును రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎసిపి వెంకటేష్ మాట్లాడుతూ.. యాక్సిడెంట్లు దొంగతనాలు జరగకుండా రేడియం ఇమేజ్ కలిగిన పోలీస్ కారు కాపాడుతుందని అన్నారు. పర్వతగిరి సిఐ రాజగోపాల్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పెట్టించుకున్నట్లయితే యాక్సిడెంట్లు దొంగతనాలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ..గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఒకొక్క సీసీ కెమెరా ఒక పోలీసుతో సమానమని,కెమెరాల ఏర్పాటుతో నిత్యం పోలీస్ నిఘా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు

## సహజ రంగులతో సాంప్రదాయబద్ధంగా హోలీ జరుపుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)
శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగతో పాటు రంజాన్ మాసం కూడా కొనసాగుతున్నందున మత సామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో పండుగలను నిర్వహించుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు.ప్రధాన చౌరస్తాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై లేదా బహిరంగ ప్రదేశాల్లో బలవంతంగా రంగులు లేదా రంగు నీళ్లు చల్లకూడదని స్పష్టం చేశారు. బైకులు, కార్లలో గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని హెచ్చరించారు. హోలీ అనంతరం చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే సమయంలో యువత తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సిఐ కరుణాకర్ రావు విజ్ఞప్తి చేశారు.

## ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కొడకండ్ల, మార్చి 02 (ప్రజాజ్యోతి): మండలంలోని ఏడునూతుల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులు కలెక్టర్,ఎంఈఓ, డీఈవో, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కలెక్టర్ గా జి. అనుశ్రీ, డీఈవో గా టీ. సాత్విక్, ఎంఈఓ గా బి. సాత్విక్, హెడ్మాస్టర్ గా సుహాన, ఇతర విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. బాలశౌ రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ఏటూర్ నాగారం మార్చి 02 ప్రజాజ్యోతి : ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందనీ కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ అన్నారు. వికలాంగులకు పెన్షన్ ఇప్పించిన ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలమేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు.మండల ఇంచార్జి ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో.ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన కోట రంజిత్,లింగం నాగఅక్షయ గల లబ్ధిదారులకు పెన్షన్ ఇప్పించిన ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. సంక్షేమ పథకాలు ఇంటికి చేరవేస్తున్న ప్రభుత్వం పై హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు ప్రజలు..ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, కే. రంజిత్, టౌన్ ఉపాధ్యక్షులు మామిడి రాంబాబు పాల్గొన్నారు.

## రామాలయం వద్ద కాముడి దహనం





ఏటూరు నాగారం మార్చి 02 ప్రజా జ్యోతి మండల కేంద్రంలో బొడ్రాయి వద్ద హోలీ పండుగ సందర్భంగా కాముడి దహనం కార్యక్రమం భక్తుల మధ్య ఘనంగా నిర్వహించబడింది. సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించిన అనంతరం కాముడి దహనం చేశారు. పూజారి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చెడుపై మంచి విజయం సాధించిన సంకేతంగా కాముడి దహనం జరుపుకుంటామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం ప్రశాంతంగా ముగిసేలా చర్యలు చేపట్టారు. కాముడి దహనం కార్యక్రమంతో గ్రామంలో హోలీ వేడుకలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.

## రోడ్ భద్రతపై పోలీసుల వినూత్న ప్రచారం

(మొదటి పేజీ తరువాయి...)
వినూత్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటూర్ నాగారం ఏఎస్పీ పర్యవేక్షణ లో ఏటూర్ నాగారం సీఐ అనుముల శ్రీనివాస్.ఎస్ ఐ మహేష్. ఆధ్వర్యంలో పోలీసులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏటూర్ నాగారం ఏ ఎస్పీ మనన్ భట్ ఐపిఎస్ మాట్లాడుతూ. ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకుండదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా యువతకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం ప్రాణనష్టం కలిగించవచ్చని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు పోలీసుల ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటిస్తామని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో సి ఐ అనుముల శ్రీనివాస్.ఎస్ ఐ మహేష్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకున్న దివ్యాంగులు యుడిఐడి సదరం క్యాంపుకు హాజరుకావాలి

జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 2 (ప్రజాజ్యోతి): మీ సేవలో యూడిఐడి వెబ్సైట్ లో స్లాట్ బుకింగ్ చేసుకున్న జిల్లా లోని వివిధ రకాల వికలాంగులు కొత్త వారు, రెన్యూవల్ వారు రసీదులో ఉన్న ఫోన్ నెంబర్ కు మెసేజ్ వచ్చిన తేదీలలో జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి వసంత కోరారు. ఈనెల 6వ తేదీ నుండి కొనసాగే ఈ శిబిరం 6,9,11,12,13, 18,24,25,26,30వ తేదీలలో ఆర్థో, దృష్టి, వినికిడి లోపం, మానసిక, తలసేమియా, క్రానిక్ న్యూరాలజీ, సంబంధిత వికలాంగులకు డాక్టర్ లచే క్యాంపులు నిర్వహించబడు తున్నారు. కొత్తవి 292ఉండగా, రెన్యూవల్ 136 ఉన్నాయని మొత్తంగా 428మందికి అవకాశం ఉన్నదన్నారు. యుడిఐడి సదరం స్లాట్ బుకింగ్ కు మీ సేవ లో రూ.35 లు మాత్రమే చెల్లించాలని, సదరం సర్టిఫికెట్ లో 40 శాతం కన్నా తక్కువగా ఉండి రిజెక్ట్ అయిన వికలాంగులు మీ సేవలో యుడిఐడి వెబ్సైట్లో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. ఫోన్ కు మెసేజ్ వచ్చినవారు డాక్టర్ రిపోర్టులతో ఆధార్ కార్డు ఫోటో మీసేవ రసీదు తో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరు కాగలరని తెలియజేశారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9866460830ను సంప్రదించాలన్నారు.

## కోటగుళ్ళు గోశాల గోమాతలకు దాణా బస్తాల వితరణ



గణపురం ప్రజాజ్యోతి మార్చ్ 02 ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గోశాల గోమాతలకు ములుగు జిల్లా కేంద్రంలో ఏఎస్ఐ గా పనిచేస్తున్న బండారి శంకరయ్య, తిరుపతమ్మ దంపతులు దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మొదట స్వామివారికి అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కోటగుళ్ళ గోశాల గోమాతలకు దానా బస్తాలు అందజేసిన శంకరయ్య తిరుపతమ్మ దంపతులకు కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మురికి కాల్వల లేమితో దుర్వాసన.. ఆరోగ్య సమస్యలు

- **గ్రీవెన్స్ లో కమిషనర్ కి వినతి పత్రం**

**హసన్‌పర్తి,మార్చి-2(ప్రజాజ్యోతి):**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 65వ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని బీ ఆర్ఎస్ డివిజన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.డివిజన్ పరిధిలోని చింతగట్టు బొడ్రాయి సమీపంలో మురికి కాల్వలు లేకపోవడంతో మురికి నీరు నిలిచిపోతోందని, దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి పిల్లలు, వృద్ధులు అనారోగ్య



సమస్యలకు గురవుతున్నారని వారు వివరించారు. వెంగళ వెంకటేశ్ నివాసం నుంచి పోచమ్మ ఆలయం వరకు కొత్త పక్కా మురికి కాల్వ నిర్మించాలని, అలాగే ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో జనగాని రాజు నివాసం నుంచి జనగాని మధు నివాసం వరకు కాంక్రీట్ రహదారి వేయాలని కోరారు.చింతగట్టు, మునిపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో శ్మశాన వాటికల నిర్మాణ పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకులు కాయిత రఘువీర్ రెడ్డి, తంగేళ్లపల్లి కోటేశ్వర్, ఇంద్రాక్షి శివకోటి, మార్క భాస్కర్, నద్దునూరి సంపత్, గోపురాజు రమేష్, రాయికంటి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# తక్కళ్లపహాడ్ లో 'ప్రీ ప్రైమరి స్కూల్' మంజూరు చేయాలి

- **జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించిన సర్పంచ్**



**దామెర, మార్చి 02 (ప్రజాజ్యోతి):**హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కళ్లపహాడ్ గ్రామంలో 'ప్రీ ప్రైమరి స్కూల్' మంజూరు చేయాలని సర్పంచ్ దాడి వసంత రమేష్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు నిర్వహించేందుకు గదులు ఉన్నాయని వారు కలెక్టర్ కు వివరించారు. గత సర్పంచ్ పాఠశాల ఆట స్థలంలో రైతు వేదిక నిర్మించటం వలన ఆట స్థలము లేకుండా పోయిందని పేర్కొన్నారు. మిగిలిన స్థలంలో ముళ్ల చెట్లు, పిచ్చి చెట్లు పెరిగి పాఠశాల వాతావరణం లేకుండా పోయిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో పిల్లలు పాఠశాలకు రాలేక పోతున్నారని కలెక్టర్ కు తెలిపారు. పిల్లలకు వారి తల్లిదండ్రులకు నచ్చచెప్పి ప్రభుత్వ పాఠశాలకు పిల్లలు వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ముళ్ల చెట్లు, పిచ్చి చెట్లు తొలగించి పిల్లలకు ఆట స్థలము, లైబ్రరీ, వ్యాయమ శాల ఏర్పాటుకు, కూలిన ప్రహరీ గోడ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాడి వసంత రమేష్ కలెక్టర్ కు పుష్ప గుచ్ఛం అందించారు.

# గాంధీ కుటుంబ పెయింటింగ్ అందజేసిన ఇనగాల



**హన్మకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 2, (ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో గత పది రోజులుగా కొనసాగిన తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ఘనంగా ముగిశాయి. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 2 వరకు నిర్వహించిన ఈ శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తన సతీమణి అవంతి రెడ్డితో కలిసి రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీ కుటుంబానికి చెందిన అరుదైన పెయింటింగ్‌ను జ్ఞాపికగా ఆయనకు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తదితర కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# దండేపల్లి గ్రామంలో రెండవ అంగన్వాడి సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ

**ఎల్కతుర్తి మార్చి 2 (ప్రజా జ్యోతి)** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని దండేపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల భాగంగా రెండవ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ అధ్యక్షత వహించి భూమి పూజ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి దిశగా ఈ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్కతుర్తి ఏ ఎం చైర్మన్ సూకినే మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గేటి ఇంద్రసేనారెడ్డి, బావు పెట్ సర్పంచ్ బత్తిని రవీందర్ ఉప సర్పంచ్ శనిగరపు సందీప్ ప్రజా నిర్మాణ శాఖ ఏఈ ఉమామహేశ్వర్ పంచాయతీ కార్యదర్శి తాళ్ల పల్లి అఖిల హాజరయ్యారు. అలాగే దండేపల్లి గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలోని చిన్నారుల అభ్యాసం పోషకాహార సదుపాయాల మెరుగుదలకు ఈ అంగన్వాడి భవనం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు.



# ఇనగాలకు శిక్షణా సర్టిఫికేట్

- **ముగిసిన 'సంఘటన్ సృజన్ అభియాన్' శిబిరం**



**హన్మకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 2, (ప్రజా జ్యోతి):**కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే లక్ష్యంతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో వికారాబాద్‌లో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల పది రోజుల శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 2 వరకు కొనసాగిన ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి 'సంఘటన్ సృజన్ అభియాన్' సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ సంయుక్తంగా సర్టిఫికేట్‌ను అందజేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయడం, సంస్థాగత బలోపేతం, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో దిశా నిర్దేశం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాల్లో జిల్లా అధ్యక్షుల పాత్రపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.ఏఐసీసీ, టీపీసీసీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ హనుమకొండ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు, సంఘటన్ సృజన్ కార్యక్రమం చైర్మన్ సచిన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా వంశీ చందర్ రెడ్డి, టీపీసీసీ ముఖ్య నాయకులు, ఇతర జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# వీడియోగ్రాఫర్ల బకాయిలు చెల్లించాలి




**హన్మకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 2, (ప్రజా జ్యోతి):** గత సర్పంచ్ ఎన్నికల్లో ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి విభాగాల్లో వీడియోగ్రాఫర్లుగా పనిచేసిన వారికి మూడు నెలలు గడిచినా పారితోషికం చెల్లించలేదని బాధితులు తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు విధులు నిర్వహించినప్పటికీ ఎంపీడీవో కార్యాలయాలు బకాయిలు చెల్లించకుండా తిప్పిస్తున్నాయని ఆరోపించారు. వెంటనే చెల్లింపులు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆర్గనైజర్ కోడెపాక భాస్కర్‌తో పాటు పలు మండలాల వీడియోగ్రాఫర్లు హెచ్చరించారు.

# దేవాదుల పైప్ లైన్ లీకేజీ ఎగిసిపడుతున్న నీరు



**ధర్మసాగర్, మార్చి 02(ప్రజాజ్యోతి)** వేలేరు మండల పరిధిలోని మల్లికుదుర్ల శివారులో దేవాదుల పైపులైన్ లీకేజీ ఏర్పడింది. పైప్ లైన్ లీకేజీ తో నీరు పైకి ఎగిసిపడుతూ ఆకాశానంటుతున్నట్లు కన్పిస్తుంది. పైప్ లైన్ లీకేజీ తో నీరు వృధాగా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అయితే మల్లికుదుర్ల ప్రక్క రైతులు వారి పంట పొలాలకు సాగునీరు అందించేందుకే దేవాదుల పైప్ లైన్ కు లీకేజీ చేసినట్లు ప్రక్క రైతులు ఆరోపిస్తున్నారు.

# ధర్మసాగర్‌లో ఘనంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

- **150 మందికి పరీక్షలు 60 మందికి ఉచిత శస్త్రచికిత్సలు**

**ధర్మసాగర్, మార్చి 02(ప్రజాజ్యోతి)**ధర్మసాగర్ గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి–ఏలియా ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి దవాఖాన మరియు గణేష్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.శిబిరంలో సుమారు 150 మంది గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం కంటి శస్త్రచికిత్స అవసరమైన 60 మందిని గుర్తించారు. వారికి సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి దవాఖానలో పూర్తిగా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు రవాణా, భోజనం మరియు వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జి. గణేష్, నేత్ర వైద్య సహాయక నిపుణులు వి. శ్రీజ, నర్సింగ్ ఆఫీసర్ ఎం. రాణి, ఏఎన్ఎం జి. కవిత, కో–ఆర్డినేటర్ టి. పూజ, ఏ. ఓంచక్రం తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని విజయవంతం చేశారు.



## 10 వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ




**పరకాల, మార్చి 02, (ప్రజా జ్యోతి ):**పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల్లో ఉపయుక్తంగా ఉండే ఎగ్జామ్ ప్యాడ్లు, కంపాస్ బాక్సులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రౌత్ మనోహర్ జ్ఞాపకార్థం గా పరకాల పట్టణం లోని గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసిల్దార్ విజయలక్ష్మి చేతుల మీదుగా 40 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఫైనల్ పరీక్షలను ధైర్యంగా రాయాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో భయపడకుండా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ దామోదర్, గర్ల్స్ హైస్కూల్ ఇంచార్జి పద్మజ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ, హేమంత్, సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దగ్గువారి పల్లెలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- మూడు నూతన బోరు మోటర్లు ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు






**ఎల్కతుర్తి మార్చ్ 2 (ప్రజా జ్యోతి )** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీర నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని దగ్గువారి పల్లెలో గత కొన్ని సంవత్సరాల నుండి కొనసాగుతున్న నీటి కొరత సమస్యకు గ్రామ నాయకత్వం చొరవ తీసుకొని శాశ్వత పరిష్కారం చూపింది. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన మూడు బోరు మోటర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు ఉపసర్పంచ్ చదిరం సుశీల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో బోరు మోటర్లు ఏర్పాటు చేసి తక్షణమే నీటి సరఫరా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుల్లూరి శ్రీధర్ రావు మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించడం ప్రాధాన్యతగా తీసుకున్నామని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మరిన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపసర్పంచ్ చదిరం సుశీల శ్రీనివాస్ గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కొంతకాలంగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న దగ్గువారి పల్లె ప్రజలు బోరు మోటర్లు ఏర్పాటుతో ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారం అవడంతో గ్రామస్తులు గ్రామ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ గ్రామ పెద్దలు వార్డు సభ్యులు గ్రామ యువకులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలు





**హన్మకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 2, (ప్రజా జ్యోతి ):** వరంగల్ మహానగరంలో ప్రఖ్యాతి గాంచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పడి 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 29న (ఆదివారం) ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయి పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు.చారిత్రక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్లో చదివి ప్రస్తుతం దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ ఈ మహోత్సవానికి హాజరవుతున్నారని తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాశాల నూతన భవన నిర్మాణం కొరకు రూ. 28 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కావున మార్చి 29న నిర్వహించనున్న ప్లాటినం జూబ్లీ వేడుకలలో భాగస్వాములు కావాలని స్థానిక శాసనసభ్యులు, కలెక్టర్ ను సంఘం నాయకులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నేతలు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్ రావు, యం. ప్రకాశ్, యం. భిక్షపతి, యం. శ్రీనివాసులు, యం. మల్లారెడ్డి, జి. సురేందర్, డి. సాయిరాజ్, ఏ. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక



**హసన్‌పర్తి,మార్చి–2(ప్రజాజ్యోతి ):**ప్రతి సంవత్సరం హోలీ పర్వదినాన జరిగే ఎర్రగట్టుగుట్ట జాతర నిర్వహణ కోసం హసన్‌పర్తి గ్రామంలో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ నిర్వహణ బాధ్యతలు చేపట్టే కమిటీకి నియామక ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. ఈ కమిటీలో హసన్‌పర్తి నుంచి ఆరుగురు, భీమారం నుంచి ఆరుగురు సభ్యులను ఎంపిక చేసినట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, జాతర నిర్వహణ సజావుగా సాగేందుకు సహకరిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

**హసన్‌పర్తి నుంచి ఎంపికైన కమిటీ సభ్యులు:**గరిగే రమ్యకృష్ణరాజు,జన్ను సురేష్, గోపరాజు కనక స్వామి,వెళిసోజ్ రాజశేఖర్,వీసం రవీందర్ రెడ్డి, పెద్దమ్మ జితేందర్.**భీమారం నుంచి ఎంపికైన కమిటీ సభ్యులు:**మార్క రాజ్,తోట శ్రీనివాస్,చిట్యాల రమేష్,సదగంటి సదానందం, సంఘాల సుమన్,గండి సందీప్ లను ఎన్నుకోవడం జరిగింది.ఉత్సవాల నిర్వహణలో సహకరించిన నాయకులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గేయ పరిమళాలు పుస్తకం పొందిన మాచర్ల సంజీవ్



**చిట్యాల మార్చి 2, ( ప్రజా జ్యోతి )**తెలుగు సినిమా గేయాలు సమాజానికి ఎలా ఉపయోగపడుతాయి అనే కోణంలో డాక్టర్ నోము ల రాజు సంపాదకత్వం లో వచ్చిన గేయ పరిమళాలు అనే పుస్తకం 28 ఫిబ్రవరి శనివారం రోజున జానపద గిరిజన విజ్ఞాన పీఠం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విద్యాలయం వరంగల్ లో ఆవిష్కరించడం జరిగింది .ఈ పుస్తకాన్ని చిట్యాల మండలం కేంద్రంలో నీ తిరుమల స్టూడియో యజమాని మాచర్ల సంజీవ్ కు లభించింది ఈ పుస్తకంలోని రచయితలందరూ డిగ్రీ ,పీజీ చదివే నేటి విద్యార్థుల చేత రాయించడం ఒక విశేషం యూనివర్సిటీ స్థాయిలో వచ్చిన ఈ పుస్తకం ఫోటోగ్రాఫర్ కు అంకితం ఇవ్వడం గొప్ప అరుదైన గౌరవం. ఇది వారి మధ్య గల గురు శిష్య బాంధవ్యానికి పత్రిక . మానవీయ విలువలకు సూచికగా నిలుస్తుందన్నారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినిమా గేయ రచయిత మౌన శ్రీ మల్లిక్ , ఆచార్య పతంగి వెంకటేశ్వర్, కవి, రచయిత గోవిందం లక్ష్మి నరసయ్య, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా

- వార్డు కౌన్సిలర్ తో వార్డుల పర్యటన
- ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



**నర్సంపేట మార్చి 02 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డు 9వ వార్డుల్లో నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు 17వ వార్డు స్థానిక కౌన్సిలర్ సలావుద్దీన్ అయూబ్ ఖాన్ తో కలిసి పర్యటించిన నర్సంపేట మున్సిపాలిటి ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్,వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ ఉదయం 17వ వార్డు తోపాటు 9వ వార్డులో అధికారులతో కలిసి పర్యటించడం జరిగిందన్నారు, వార్డుల్లో పర్యటిస్తున్నప్పుడు తమ దృష్టికి ప్రతి సమస్యను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో వార్డులను సమగ్ర అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు, అదే విధంగా 17వ వార్డులో స్థానిక కౌన్సిలరు అయూబ్ ఖాన్ తో వారి వార్డులో పర్యటిస్తున్నప్పుడు వారు మా దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు, 17వ వార్డు 9వ వార్డుల్లో అవసరమైన సీసీ రోడ్డు, సైడు కాలువల నిర్మాణ పనులు చేపట్టి, నీటి సమస్య, పారిశుద్ధ పనులపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి వార్డులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నాడం జరిగింది,అర్హులందరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందించే పథకాలు అందిస్తామన్నారు, ఈ సందర్భంగా అధికారులకు సిబ్బందికి వార్డుల్లో ఎక్కడ సమస్య ఉన్న వెంటనే స్పందించి తమ దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారికి సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు కాట శ్రీనివాస్, జూలూరి కావ్య, వాటర్ సప్లై కొల్లూరి రంజిత్, వార్డు జవాన్ మాదాసి భరత్, మాజీ కౌన్సిలరు మేర్గు సాంబయ్య, మాజీ ఎంపీటీసీ పేరం బాబు రావు, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మసూద్ భాయ్, 9వ వార్డు అధ్యక్షులు గిరగాని రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల వీరస్వామి, మేరుగు కిరణ్, ఆకుల శ్రీను, దండు నవీన్, బండారు శివ, నామాసు వెంకటేశ్వర్లు, సల్మాన్, సాయి, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు, పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్
- అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్యాడ్ ల పంపిణీ



**గణపురం ప్రజాజ్యోతి మార్చ్ 02** విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని గణపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. సోమవారం గణపురం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేసు సతీష్ అధ్యక్షతన పరీక్ష ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టగా ముఖ్యఅతిథిగా సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అప్పయ్య పల్లి సర్పంచ్ ఎలుక పెల్లి రమేష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ పరీక్ష సామాగ్రిని అందజేశారు.గత ఐదు సంవత్సరాలుగా ప్యాడ్ లు అందిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ను ఉపాధ్యాయ బృందం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తిక్క సంపత్ ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్ అంబేద్కర్ సంఘ వ్యవస్థాపక సభ్యులు కట్ల శంకరయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆరు ముళ్ళ ఎల్లస్వామి దూడపాక దుర్గయ్య, దూడపాక శ్రీనివాస్ సిలువేరు ఉదయాకర్ ఉపాధ్యాయులు సరిత, రమేష్ రాంబాబు రమేష్ సంఘ నాయకులు కొంపెల్లి సాంబయ్య పెండేల తిరుపతి శివ లు పాల్గొన్నారు.

## ఎంజీఎం హైస్కూల్లో ముందస్తు హోళి సంబురాలు

**గణపురం ప్రజాజ్యోతి మార్చ్ 02** గణపురం మండలం చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎంజీఎం హైస్కూల్ నందు వివిధ రకాల రంగులు పూలతో విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ బద్ధంగా ఒకరికొకరు ఆపాదించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ హోళి పండుగను భారతదేశ ప్రజలు ప్రతి ఏటా పాల్గుణ మాసంలో పౌర్ణమి రోజు జరుపుకుంటారని హోళి అనగా అగ్ని లేదా అగ్నితో పునీతమైనదని, ఈరోజు రంగులు, పూలు చల్లుకోవడం ద్వారా ప్రేమ, సౌభాగ్యాలు వెల్లివిరిస్తాయని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా హోళి కి ముందు రోజు కాముని దహనం పేరుతో చలిమంటలు వేయడం ఆనవాయితీ అని, సుఖం, దుఃఖం, సంతోషం, విచారం



వీటన్నింటి మేలు కలయికే మన ఈ రంగుల జీవితం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపల్ మధుకర్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భద్రాచల సీతారాముల కల్యాణ కోటి గోటి తలంబ్రాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్పీ ని ఆహ్వానించిన రామ దాసు భక్తి మండలి





**గణపురం ప్రజాజ్యోతి మార్చ్ 02** గణపురం మండలం చెల్పూర్ గ్రామం లో గత తొమ్మిది సంవత్సరాలుగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న భద్రాచల సీతారాముల కళ్యాణ కోటిగోటి తలంబ్రాల కార్యక్రమం ఈ పది వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భూపాలపల్లి పట్టణం సుభాష్ కాలనీ రామాలయంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ భూపాలపల్లి వారితో సంయుక్తంగా శ్రీరామదాసు భక్తమండలి చెల్పూర్ భూపాలపల్లి వారు ఈ శుక్రవారం సాయంత్రం సామూహిక వడ్లవలుపు రాముని పిలుపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి భూపాలపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ ఐఏఎస్ , జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సంకీర్త్, డీఎస్పీ సంపత్ రావు, టౌన్ సిఐ శ్రీ నరేష్, ఎస్ఐ ఎం సాంబమూర్తి, ఎమ్మార్వో శ్రీనివాస్ ,సింగరేణి జిఎం ను పుర ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగినది.ఈ కార్యక్రమంలో రామదాసు భక్త మండలి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రామదాసు తిరుపతి, బజరంగ్దళ్ జిల్లా అధ్యక్షులు శ్యామ్ లాల్, జెన్కో హెచ్ఆర్ మధుసూదన్ రెడ్డి, సభ్యులు కేతం నరేష్ కిరణ్ రెడ్డి పాల్గొనడం జరిగింది

## పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి

- ముమ్మరంగా సైడ్ కాల్వల పూడికతీత పనులు
- వార్డు సభ్యురాలు కృష్ణవేణి



**ఏటూర్ నాగారం మార్చి 02 ప్రజా జ్యోతి** పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టిసారించి గ్రామంలో ముమ్మరంగా సైడ్ కాల్వల పూడికతీత పనులు అద్భుతంగా చేయడం జరుగుతుందినీ వార్డు సభ్యురాలు కృష్ణవేణి అన్నారు. ఏటూర్ నాగారం మండల కేంద్రంలోనీ మానసపల్లి 12వ వార్డు వార్డ్ మెంబర్‌గా గెలుపొందిన కొయ్యల కృష్ణవేణి , ఎన్నికల అనంతరం ప్రజాసేవలో చురుగ్గా పాల్గొంటూ తమ బాధ్యతను నిరూపిస్తున్నారు. సోమ వారం తమ వార్డులోని కాల్వలను స్వయంగా పరిశీలించి, శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటూ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా తెలుసుకొని, వాటికి వెంటనే పరిష్కారం చూపేందుకు అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ, "ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా ప్రధాన లక్ష్యం. నా వార్డు అభివృద్ధే నా ధ్యేయం. ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కృష్ణవేణి గారి సేవలను స్థానిక ప్రజలు ప్రశంసిస్తూ, తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## ఆలయ పునర్నిర్మాణంలో బాధ్యులుగా ఉన్నందుకు జన్మ ధన్యం

- ఆలయ కమిటీ చైర్మన్ కు ఘన సన్మానం



**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి,మార్చి 2.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోటంచ గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మెన్గా బాధ్యతలు చేపట్టిన నాయినేని సంపత్ రావు ను సోమవారం నాడు సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని రాయపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు క్యాతం సదయ్య ఆధ్వర్యంలో.. మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. వారితో మాట్లాడుతూ దేవుడికి సేవ చేయడం ఆ భగవంతుడు ఇచ్చిన అదృష్టంగా భావించి గుడి పునర్నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నందుకు మీ జన్మ ధన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇప్పకాల సాంబయ్య,ఉప సర్పంచ్ బూర్గుల వెంకటేష్వార్డ్ మెంబర్లు దాట్ల సాంబయ్య ,దండవేణి రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుర్రం జగన్ , కౌడాగాని శ్రీనివాసరావు, తూముల రాజయ్య ,ఆవుల రాజయ్య , పల్నాటి రమేష్ , మేకల నరేందర్ , తాడేం రవి వర్మ , కనకం శీను , క్యాతం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ లెవెల్ షోటోకెన్ కరాటే ఛాంపియన్ షిప్ లో శ్రీ నారాయణ విద్యార్థుల ప్రతిభ

- విజేతలను అభినందించిన గణపురం ఎస్సై రేఖ అశోక్



**గణపురం ప్రజా జ్యోతి మార్చ్ 02** గణపురం మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హై స్కూల్ విద్యార్థులు మేడారంలో నిర్వహించిన 8వ స్టేట్ లెవెల్ షోటోకెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2026లో ప్రతిభ కనబరిచారు. 5 గోల్డ్, 6 సిల్వర్, 2 బ్రౌన్ మెడల్స్ సాధించారు. విజేతలను సోమవారంగణపురం ఎస్ఐ రేఖ అశోక్ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి విద్యార్థుల కృషి, శ్రద్ధను ప్రశంసించారు.విద్యార్థుల విజయానికి కరాటే మాస్టర్ కుమార్ చేసిన శిక్షణ ముఖ్యపాత్ర పోషించారని.ఇదే సమయంలో,పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు రూపొందించిన మోడల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతుగంటి శశిధర చారి, ప్రిన్సిపాల్ స్వప్న చారి, వ్యాయామ ఉపాధ్యాయులు కార్తీక్ రాజేందర్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు,

## ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి

- సర్పంచ్ గొంది సుజాత నాగేశ్వరరావు



**ఖానాపురం /మార్చి 2(ప్రజా జ్యోతి)** జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపురం మండలం మంగళ వారి పేట సర్పంచ్ గొంది సుజాత నాగేశ్వరరావు అన్నారు. మంగళ వారి పేట అటవీ పరిసర ప్రాంతంలో సోమవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించి ఆమె మాట్లాడారు. సాధ్యమైన మేరకు గ్రామస్తులు, ఉపాధి హామీ పథకంలో ఉన్న తమ పని దినాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుషబోయిన రాజు, పంచాయతీ కార్యదర్శి యుగంధర్, ఫీల్డ్ అసిస్టెంట్ పులిగిల్ల శ్రీశైలం, కూలీలు తదితరులున్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు



**కొడకండ్ల, మార్చి 2 (ప్రజాజ్యోతి):** కొడకండ్ల మండల కేంద్రంలోని హరిజనవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకొని ఎంతో ఉత్సాహంగా హోలీ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధికి ఆకర్షితులై ఎమ్మెల్యే దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

- కుమ్మరి సంఘం బాధ్యులు,రైతులు



**నర్సంపేట మార్చ్ 02 (ప్రజా జ్యోతి )** నర్సంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి సమక్షంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కుమ్మరి సంఘం బాధ్యులు రైతు సోదరులు,పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు.చిలువేరు కొమ్మలు చిలువేరు కొమురయ్య వరంగంటి సారంగం రాదరపు రాజు రుద్రరపు శివఓదెల చెంద్రయ్య,రాదరపు చిన్నరాజు చిలువేరు చిన్నరాజుచిలువేరు వెంకటేశ్వర్లు రేమిడి శ్రీనివాస్ రెడ్డి పోగుల శ్రీనివాస్ కండికొండ శ్రీధర్ నిమ్మల శ్రీను తో పాటు కుమ్మర సంఘం నుండి 60 కుటుంబాలు రైతు సంఘం నాయకులు 30 కుటుంబాలకు ఎమ్మెల్యే దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో కుమ్మరి సంఘం నాయకులు,రైతులు కుమ్మరి సంఘం కమిటీ హాల్ భవనం తో పాటు వట్టే వాగుపైలో లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే మాధవరెడ్డి తప్పక ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

## గుండె పోటుతో వ్యక్తి మృతి



**రాయపర్తి, మార్చి 2 ప్రజా జ్యోతి** గుండె పోటు తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోనీ గనేసు కుంట తండా లో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని గణేష్ కుంట తండా గ్రామానికి చెందిన మునావత్ చత్రు నాయక్(50)సోమవారం ఉదయం గుండె పోటు తో మృతి చెందాడు.మృతుడు తొర్రూరు పట్టణ కేంద్రంలోని దుబ్బ తండ లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మృతునికి భార్య,ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.చత్రు నాయక్ మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.కాగా మృతుని కుటుంబ సభ్యలను గ్రామ సర్పంచ్ మూనావతు రఘు వార్డు సభ్యులు గ్రామస్తులు వివిధ పార్టీల నాయకులు ప్రగాఢ సానుభూతినీ అందించి కుటుంబ సభ్యులను ఓదార్చి అంతమ యాత్రలో పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్ర భవనానికి స్థలం కేటాయించాలి: కలెక్టర్‌కు వినతి



**కాళేశ్వరం మర్చి :02(ప్రజాజ్యోతి )** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో మంజూరైన అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణానికి తక్షణమే స్థలం కేటాయించాలని గ్రామ సర్పంచి ఏల్పుల సరిత జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి స్వంత భవనం లేకపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం భవన నిర్మాణానికి మంజూరు చేసినప్పటికీ స్థలం కేటాయింపు లేక పనులు ప్రారంభం కాలేదని వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ రాహుల్ శర్మ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎం.ఈ.ఓ ను సస్పెండ్ చేయాలి

- బిట్స్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.
- కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు.



**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, మార్చి 2.** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిట్స్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మూసి వేసిన పాఠశాలకు అనుమతులు ఇచ్చిన చిట్యాల ఎం.ఈ.ఓ ను సస్పెండ్ చేయాలని ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొతుకు.ప్రవీణ్ కుమార్ ప్రజావాణిలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. బిట్స్ పాఠశాల యాజమాన్యం ఇంకో బ్రాంచ్ కోసం పది సంవత్సరాల నుండి మూసివేసిన శాంతినికేతన్ పాఠశాలకు అనుమతులు తీసుకొని జిల్లా ప్రజలను, అధికారం మోసం చేశారని తెలిపారు. చిట్యాల ఎంఈఓ భూపాలపల్లికి మండల ఎంఈఓ ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న క్రమంలో బిట్స్ పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై అవినీతికి పాల్పడి నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలకు గుర్తింపు ఇచ్చారని తెలిపారు. వెంటనే ఎంఈఓ ను సస్పెండ్ చేయాలని,శాంతినికేతన్ పాఠశాల పర్మిషన్ తీసుకొని బిట్స్ పాఠశాల అని చెప్పి విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేసి పాఠశాల నడుపుతున్నారని వెంటనే ఆ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పలుసార్లు జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. బిట్స్ యాజమాన్యం శాంతినికేతన్ పాఠశాల పేరు మీద పర్మిషన్ తీసుకొని ఆ పాఠశాల పేరు మీద కాకుండా బిట్స్ పాఠశాల బోర్డు పెట్టి విద్యార్థులకు టై బెల్ట్ యూనిఫామ్ స్టడీ సర్టిఫికెట్ ఫీజు రిసిప్ల మీద కూడా బిట్స్ పాఠశాల అని తప్పుడు పేరు రాసి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నిడుతుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్ కావాలంటే ఏ పాఠశాల పేరు మీద ఇస్తున్నారు తెలవక ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు. కావున ఎంఈఓ, బిట్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన పోరాటాలు చేస్తామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, రాజుల శివకుమార్, పవన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎస్ఆర్ఆర్ చైర్మన్

- పరుపాటి శ్రీనివాసరెడ్డి




**రాయపర్తి, మార్చి 2 ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామంలో సోమవారం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకుబాధిత కుటుంబలు అయిన వశపాక రవి, చిక్కుడు సంధ్యారాణి ఇటీవల వివిధ కారణలతో మరణించగా సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబనికి 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ లను సహాయం చేసి, మరియు ఇటీవల చికిత్స తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గజావెల్లి నర్సయ్య వారిని పరామర్శించి, ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్ మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కోలా సంపత్ స్థానిక నాయకులు అయిన మాజీ సర్పంచ్ గజావెల్లి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు దోకుడు దేవేందర్, పార్టీ ముఖ్య నాయకులు గుడి యుగేందర్ రెడ్డి, దోకుడు సొమెందర్, దొంతారాబోయిన యాదగిరి, గజావెల్లి రాజు, వశపాక మారయ్య, వశపాక యాకయ్య, అంజయ్య, నాయకులు పాల్గొన్నారూ.

## కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిసిన డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్




**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి ,మార్చి 2.** తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ సంఘటన్ శ్రీజన్ అభియాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరం ను ఫిబ్రవరి 21 నుండి మార్చి 2 వరకు వికారాబాద్ లోని హరిత వ్యాలీలో ఏర్పాటు చేయడం జరిగినది ముగింపు కార్యక్రమానికి పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాన్యశ్రీ గౌరవ రాహుల్ గాంధీ రావడం జరిగింది . వారిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ కుటుంబ సమేతంగా కలిసినారు ఈ సందర్భంగా రాహుల్ గాంధీ అధ్యక్షులను ఉద్దేశించి మాట్లాడుతూ, డిసిసి అధ్యక్ష పదవి అనేది ఒక బాధ్యతాయుతమైన పదవని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండుకుంటూ, అనునిత్యం ప్రజలకై ప్రజా సంక్షేమానికై ప్రజా సమస్యలు తీర్చడంలో ముందు ఉంటూ. అభివృద్ధికి దోహదపడాలని అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అండగా నిలవాలని రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలను పాటు పడే వారిని అనునిత్యం ఖండించాలని. గాంధీ మార్గంలో నడుచుకుంటూ ప్రజలకు మేలు చేసే విధంగా అధ్యక్షులు ఉండాలని ఆశిస్తున్నాను. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలబడాలని వారితో ప్రేమగా మేలగాలని . మహిళలను గౌరవించుకుంటూ వారి అభివృద్ధికి పాటుపడాలని సూచన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షర్మిల ,తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జి మాణిక్యం ఠాగూర్ , మరియు విశ్వనాథన్ సచిన్ సావంత్ ఆంధ్రప్రదేశ్ ఇంచార్జిలు పలక్ వర్మ గారు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ డిసిసి అధ్యక్షులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ కు చేరిన పదవ తరగతి ప్రశ్నపత్రాలు



**చెన్నారావుపేట మార్చి 02 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కు పదవ తరగతి వార్షిక పరీక్షల సెట్ –1 ప్రశ్నపత్రాలు సోమవారం చేరుకున్నాయి. అధికారులు మరియు పోలీసుల పర్యవేక్షణలో ఈ పత్రాలను అత్యంత భద్రంగా స్టేషన్ లోని రూమ్ లో భద్రపరిచారు.రూట్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంట్ అధికారులు మరియు ఎస్కార్ట్ సిబ్బంది సమక్షంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ప్రశ్నపత్రాల తరలింపు మరియు భద్రత విషయంలో నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మణామూర్తి,రూట్ ఆఫీసర్లు కొర్ర సారయ్య, చరణ్ సింగ్,చీఫ్ సూపరింటెండెంట్లు యాకుబ్ రెడ్డి, రామచందర్,డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లు కిషోర్, అశోక్,చెన్నారావుపేట హైస్కూల్ హెచ్.ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు రవి, సంతోష్, సి.ఆర్.పి సంపత్, ఆఫీస్ సిబ్బంది రాజశేఖర్,ఎస్కార్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన గ్రామ సర్పంచ్

- మంచినీళ్ల రాజు

**తరిగొప్పుల మార్చ్ 2 ప్రజాజ్యోతి** అక్కరాజుపల్లి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన గ్రామ సర్పంచ్ ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం ఉందాపోషక విలువలు సరైన విధంగా ఉన్నాయలెవా అన్న విషయాలను తెలుసుకొని, వంటశాల పరిశుభ్రత, వంట పాత్రల శుభ్రత, నీటి వాడకం వంటి అంశాలను కూడా పరిశీలించారు. ఆహారం రుచికరంగా, శుభ్రంగా, సమయానికి అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులు మరియు వంట సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధి గ్రామాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులతో మమేకమై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం గురించి సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నిస్తూ పిల్లల్లో ఆనందాన్ని నింపారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచడం, తరగతి గదులు శుభ్రంగా నిర్వహించడం, తాగునీరు మరియు మరుగుదొడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని కూడా సూచించారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా చదువుకోవడం కోసం పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా అయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరిత రెడ్డి కార్యదర్శి రత్న ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





# దళిత మహాసభను జయప్రదం చేయండి

- కరపత్రాలు విడుదల చేసిన ఎంహెచ్పిఎస్ నాయకులు



**వెంకటాపురం,మార్చి 2 (ప్రజాజ్యోతి) :** మార్చి18న మాదిగ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్పిఎస్)ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండలో జరిగే దళిత మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నం గోపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.సోమవారం వెంకటాపురం మండల కేంద్రంలోనీ ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో జిల్లా,మండల నాయకులతో కలిసి దళిత మహాసభ కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు 20శాతం రిజర్వేషన్ పెంచి జనాభా దామాషా ప్రకారం ఇవ్వాలని,ఎస్సీ కార్పొరేషన్ ను మూడు భాగాలుగా విభజించి తక్షణమే చైర్మన్ లను నియమించాలన్నారు.అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులకు రూ.12లక్షల ఆర్థిక సాయం ప్రకటించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.మార్చి18న నిర్వహించే ఆవిర్భావ సభకు ములుగు జిల్లాలోని మాదిగలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు వేల్పుల.రామ్ కుమార్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి.సంతోష్,ప్రధాన కార్యదర్శి మంద.రాకేష్,నాయకులు వేల్పుల. నవీన్, వేల్పుల .కిరణ్, ధ్రువకుమార్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ కలెక్టరేట్ మార్చి 02 (ప్రజా జ్యోతి) :** జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, వరంగల్ మరియు నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, హౌసింగ్ పీడీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, దరఖాస్తుదారుల సమక్షంలో సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. ప్రజలు సమర్పించిన వినతులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా సమయపాలనతో పని చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మొత్తం 163 దరఖాస్తులు అందాయని తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 67, జీడబ్ల్యూఎంసీ కి సంబంధించినవి 38, మిగతా శాఖలకు చెందినవి 58 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చినందున వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరిత పరిష్కారం కల్పించాలని ఆదేశించారు. వృద్ధుల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను శిశు సంక్షేమ మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గ్రీవెన్స్ దరఖాస్తుల్లో ముఖ్యంగా రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ మరియు పోలీస్ శాఖలకు సంబంధించినవి అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ లేకుండా పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీబీసీడీఓ పుష్పలత, వివిధ శాఖల అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని కుటుంబసమేతంగా కలిసిన ములుగు డిసిసి అధ్యక్షుడు




**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** సంఘటన్ శ్రీజన్ అభియాన్ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటి జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరంలో ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీని సోమవారం కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కుటుంబసమేతంగా కలిశారు.గత నెల 21 నుండి వికారాబాద్ అనంతగిరి కొండల్లో జరుగుతున్న జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరానికి చివరి రోజు రాహుల్ గాంధీ హాజరుకాగా ములుగు డిసిసి అధ్యక్షుడు పైడాకుల అశోక్ కలిసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ భవిష్యత్ కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ గురించి తనతో మాట్లాడినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కోరినట్లు పేర్కొన్నారు.

# వీధి విక్రయదారుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ కలెక్టరేట్ మార్చి 02 (ప్రజా జ్యోతి ):** సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్‌తో కలసి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అమలు అవుతున్న ప్రధాన మంత్రి స్వనిధి పథకం జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో జీవనోపాధి సాగిస్తున్న వీధి విక్రయ దారులకు ఆర్థిక సహాయం అందించే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఈ పథకం కింద లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.10,000, రెండవ విడతగా రూ.20,000, మూడవ విడతగా రూ.50,000 రుణాలు మంజూరు నేపథ్యంలో మున్సిపాలిటీ వారీగా రుణాల పంపిణీ, తిరిగి చెల్లింపుల పురోగతి, కొత్త అర్హుల గుర్తింపు, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహం తదితర అంశాలపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. వీధి విక్రయదారుల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం మరింత ఉపయోగకరంగా మారేలా అన్ని మున్సిపాలిటీ లు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రుణాల పంపిణీతో పాటు సకాలంలో తిరిగి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి వీధి విక్రయదారునికి పథకం లబ్ధి చేకూరేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్లు, జిల్లా లీడ్ బ్యాంకు ప్రతినిధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గా వై.వి. గణేష్ విధుల్లో చేరిక

**వరంగల్ కలెక్టరేట్ మార్చి 02 (ప్రజా జ్యోతి ):** జిల్లాలో ఇటీవల జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో వై.వి. గణేష్ హనుమకొండ జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా బదిలీపై సోమవారం విధుల్లో చేరారు. విధుల్లో చేరిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆ మొక్కను స్వీకరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల పనితీరును సమగ్రంగా సమీక్షిస్తూ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# బోడ మాణిక్యం తండాలో ముమ్మరంగా దోమల నివారణ ఫాగింగ్



**చెన్నారావుపేట మార్చి 02 (ప్రజా జ్యోతి )** మండలంలోని బోడ మాణిక్యం తండా గ్రామంలో దోమల నివారణకు ఆదివారం రాత్రి ముమ్మరంగా ఫాగింగ్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉమా మోహన్ నాయక్, ఉపసర్పంచ్ సునీత వీరన్న ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది ఆటో ట్రాలీ సహాయంతో వీధివీధినా దోమల మందును పిచికారీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... వర్షాకాలం మరియు మారుతున్న వాతావరణం దృష్ట్యా దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామస్తులు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కాటా రంజిత్, సిబ్బంది నరేందర్, దామ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎగ్జిబిషన్ పనుల్లో ప్రమాదం యువకుడు మృతి





**వెంకటాపురం, మార్చి 2 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో విషాదం నెలకొంది.ప్రతి సంవత్సరం హోలీ పండుగ రోజు మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం జరపడం ఆనవాయితీ.స్వామివారి కళ్యాణం సందర్భంగా ఎగ్జిబిషన్ కొలంబస్ పనులు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి ఒడిశాకు చెందిన హ్యాపీ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.పనులు నిర్వహిస్తున్న సమయంలో పట్టుతప్పి ఒక్కసారిగా కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి.వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

